# మనసుకు మరోవేపు



ఇద్దరూ కలిసి ఆ సందు దాటబోతూంటే గేదెలడ్డొచ్చాయి. నారాయుడు గబుక్కుని సందులోకి తిరిగాడు. అడ్డొచ్చిన గేదెలు వెళ్లిపోయాక తిరిగి వెనక్కి వచ్చేస్తాడులే అనుకుంటూ చంటి వీధి మొగదగ్గరే ఆగిపోయాడు. ఒక్కొక్క గేదే తనని దాటుకు వెడుతుంటే హుషారుగా ఉంది చంటికి. చూసి, చూసి ఆఖరిదాని వీపు మీద ఓ చరుపు చరిచాడు.

“ఏమిటిరా ఆటలు.... రావేం....” నారాయుడు అరుపు చంటి హుషారుని చంపేసింది. కొద్దిగా అనుమానమొచ్చింది.

“నిన్నేరా..... ఇంకా పొద్దుందిగా - ఈ సందు కూడా చూసుకెడదాం రా” అంటూ ముందుకి నడిచాడు నారాయుడు.

ఇంక తప్పదని తెలుసు చంటికి. అయినా తన అరికాళ్లు ఆ వీధి మొగకి అతుక్కుపోయినట్టు కాస్సేపటికిగాని కదల్లేదు.

అడుగు తీసి అడుగు వేస్తుంటే వాడి కాళ్లకున్న గజ్జెలు ఏడుస్తున్నట్టు మోగాయి.

"ఈ సందులోకి తిరక్కుండా తిన్నగా వెళ్లి ఉంటే ఈపాటికి బస్‌స్టాండ్ చేరి ఉండేవాళ్లం...." అనిపించింది. బస్‌స్టాండ్‌తో పాటు దాని పై దారి, అరుగు, అరుగుమీద సావిత్రక్క - ఒక్కొక్కటే ఊహలో కదిలాయి చంటికి.

నడుస్తుంటే చంటి కాళ్లకి రోడ్డు స్పర్శ తెలియటం లేదు. అరికాళ్ల అంచులూ, వేళ్ల చివర్లూ, మడమలూ తిమిరెక్కినట్టు మొద్దుబారిపోయాయి. పిక్కల దగ్గర నరాలు మెలికలు పడ్డట్టు ఊరికే లాగుతున్నాయి.

సందులో మొదటి రెండిళ్ల తలుపులు తెరిచిలేవు. మూడో ఇంటి ముందాగి నారాయుడు మెడలో డోలక్ సరిచేసుకున్నాడు. నెమ్మదిగా రెండు దరువులేసి మామూలుగా తను పాడే పాటల్లో ఓ పాట అందుకున్నాడు. మనుషుల అలికిడి లేదు. ఎవరేనా వచ్చాక మొదలెడదాంలే అన్నట్టు నిలబడ్డాడు చంటి.

నారాయుడు పాడే పాటలు చంటికి బాగా తెలుసు. అవయినా మొదటి చరణాలే తప్ప పూర్తిగా రావు నారాయుడికి. నారాయుడే పాట పాడినా ఆలోచించక్కర్లేకుండానే చంటి కాళ్లు కదులుతాయి. గజ్జెలు మోగుతాయి. వాడి ఒళ్లు గంతులేస్తుంది..... పెద్దాళ్లు, చిన్నాళ్లు, అమ్మలక్కలు, అడుక్కుతినే వాళ్లు.... ఇలా ఇలా చాలామంది చూస్తారు ఆ పొట్టతిప్పల్ని.

పొద్దున్నే చంటిని పక్క ఊరు తీసుకెళ్లాడు నారాయుడు.వెళ్లేటప్పుడు రెండు మైళ్లు అలుపు లేకుండానే నడిచాడు చంటి. ఆ ఊళ్లో తిరుగుతూ నారాయుడు పాడుతుంటే చిందెయ్యటం కూడా హుషారుగానే వేశాడు. ఊరు చిన్నదవటంవల్ల మధ్యాహ్నానికే ఓ రౌండు పూర్తి చేశారు.

తిరిగొస్తుంటే సగందూరం నడిచేటప్పటికి కాళ్లు లాగటం మొదలెట్టాయి చంటికి. ముందు నారాయుడు కూనిరాగం తీస్తూ నడుస్తున్నాడు. పక్కనే ఓ ఎద్దుబండి వస్తుంటే, దానితో సమానంగా నడవాలని దానివేపే చూస్తూ నడిచాడు చంటి. ఎప్పుడేనా కాళ్లు లాగితే నొప్పి మరిచిపోవటానికి ఇదివరకు ఇలాంటి ట్రిక్కులు చాలాసార్లు చేశాడు.

ఎద్దు కదులుతుంటే దాని మెడలో మువ్వలు మోగుతున్నాయి. బండి తోలే అతను ప్రతి రెండు మూడు నిమిషాలకి దాని ఒంటిమీద కమ్చీతో 'ఛెళ్.... ఛెళ్' మనిపిస్తున్నాడు. దెబ్బలు తగులుతున్నా ఎద్దు నడకలో పెద్ద మార్పేం లేదు. అలా కొట్టడం బండతనికి, తినటం ఎద్దుకి అలవాటన్నమాట అనుకున్నాడు. అలా అనుకోగానే గబుక్కుని నారాయుడు పాడే పాటలు గుర్తొచ్చాయి చంటికి.

చాలాదూరం అలాగే బండితోపాటే నడిచాడు. కాళ్లు లాగుతున్నా పొద్దు ఉండగానే గూడు చేరుతున్నందుకు హుషారొచ్చింది చంటికి. కాని నారాయుడు ఆ సందులోకి తిరిగేటప్పటికి ఆ హుషారు చచ్చిపోయింది.

బయట హడావిడికి ఇంట్లోంచి ఎవరో ఇద్దరు కుర్రాళ్లొచ్చారు. వాళ్లని చూసి బలవంతంగా ఒంటిని కదిపాడు చంటి. కాస్సేపటికి ఎవరో పెద్దాళ్లు వచ్చారు... చంటి గజ్జెలతో అలా గంతులేస్తుంటే చిన్నపిల్లలు పగలబడి నవ్వారు.... వాళ్లని చూసి పెద్దాళ్లూ నవ్వారు.

తన ఈడు పిల్లలు తన ఆటని చూసి నవ్వుతుంటే మొదట్లో పెద్ద ఉక్రోషంగా ఉండేది చంటికి. అలా ఆడుతుండగానే పన్నెండేళ్ల వాడి మనసులో ఎన్నో ఆలోచనలొచ్చేవి.

తనలాంటి పిల్లలేగా వాళ్లూను.... తనను చూసి ఎందుకు నవ్వాలి.... తనొక్కడే రోడ్ల మీద ఇలా డాన్సెందుకు చెయ్యాలి? వాళ్లెందుకు చెయ్యరు.... తనకి అమ్మా, నాన్నా లేనందుకేనా....

ఇలాంటి ఆలోచనలకి అడుక్కుతినే వాళ్లలో చాలామంది చెప్పుకునే సమాధానమే తన మనసుకి చంటీ చెప్పుకునేవాడు - 'అది వాళ్ల అదృష్టం.... వాళ్లు చేసుకున్న పుణ్యం' అని.

నెమ్మదిగా అందరి నవ్వులూ, అన్ని రకాల మాటలూ, ఎవరేనా తనని చూసి నవ్వితే వాళ్లతో బాటు తనూ బలవంతంగా నవ్వటం.... ఇలాంటి ఎన్నెన్నో అలవాటయ్యాయి చంటికి.

సందంతా తిరిగేటప్పటికి అరగంట పట్టింది. ముప్పై పైసలొచ్చాయి. మొదట ఆడిన ఇంటివాళ్లు రెండుపైసలిచ్చారు. మరో ఇంటివాళ్లు మూడు పైసలిచ్చారు. ఎవరో స్టూడెంట్సు రూము దగ్గర ఆడితే పావలా ఇచ్చారు. ఇస్తూ ఇస్తూ, "ఈ కుఱ్ఱాడెందుకు? ఎవత్తేనా పిట్టని చూడకపోయావా" అన్నారు నారాయుడితో.

నవ్వి ఊరుకున్నాడు నారాయుడు.

ఇంక ఎండ పోతోందనగా బస్‌స్టాండ్ దగ్గరికొచ్చారు నారాయుడు, చంటి. బస్‌స్టాండ్ పక్కనే పొడుగాటి షెడ్డు ఉంది. ఊళ్లో చాలామంది అడుక్కునే వాళ్ల కదే మకాం. చీకటి పడే సమయానికి ఒక్కరొక్కరే చేరతారు.

ఇదివరకు చంటి, నారాయుడు చాలా రోజులు అక్కడే గడిపారు.

ఓ రోజు పొద్దున్న చంటి నిద్దర లేచేటప్పటికి నారాయుడు ఓ నల్లటమ్మాయితో నవ్వుతూ మాట్లాడుతున్నాడు. ఆరోజు ఊళ్లో తిరిగిందీ తక్కువే, అడుక్కున్నదీ తక్కువే. మధ్యాహ్నం మవక ముందే షెడ్డు కొచ్చేశారిద్దరూ. ఆ నల్లటమ్మాయిని షెడ్డులో దూరం నుంచే చూసి, "అప్పుడే వచ్చేసింది చూశావురా, సావిత్రి" అన్నాడు నారాయుడు హుషారుగా.

ఏమిటో అర్థం కాక - "ఎవరూ" అన్నాడు చంటి. ఏం చెప్పాలో తోచక ఫెళ్లుమని నవ్వాడు నారాయుడు. నవ్వి, "అదేరా.... ఆ నల్లది" అన్నాడు చేత్తో చూపిస్తూ.

ఆ తరువాత ఓ వారం రోజులకి ముగ్గురూ కలిసి ఆ షెడ్డులోంచి మకాం మార్చేశారు. ఇప్పటికి ఊళ్లో నాలుగైదు అరుగులు మారారు.

ఇప్పుడున్న అరుగు బస్‌స్టాండ్‌కి ఓ ఫర్లాంగు ఉంటుంది. ఏదో గోడౌన్ అరుగది. పెద్ద వీధిలోనే ఉంది. ఆ గోడౌన్ లోపలినుంచి వచ్చే ముక్కిపోయిన వాసన మొదట్లో నాలుగైదు రోజులు ముగ్గురికీ ఇబ్బందిగానే ఉన్నా, క్రమేపీ అలవాటయింది. వేళకి సావిత్రి ఇంత ఉడకేసి పెడుతుంది. సావిత్రి గురించి ఎవరితోనేనా చెప్పవలసి వస్తే "మా అక్క" అనేవాడు చంటి. ఆ వరస ఎలా వచ్చిందో వాడికే తెలియదు.

ఇద్దరూ కలిసి షెడ్డు దాటుతుంటే - "ఓ మావోఁ" అని పిలిచింది రంగి, నారాయుణ్ణి. షెడ్డులో దానితో పాటు ఇంకా నలుగురైదుగురు ఉన్నారు. అయిష్టంగానే వెళ్లాడు నారాయుడు. చంటికి నిలబడే ఓపిక లేదు. కాళ్లు సలుపుతున్నంత నెప్పిగా ఉన్నాయి. రంగి సోది మొదలెడితే ఓ పట్టాన వదలదు. జేబులు కొట్టే కబుర్లు, బూతులు - ఇలా ఆ వాగుడికి అంతు ఉండదు. చంటి కా సంగతి తెలుసు. అందుకని ఆగాలనిపించలేదు. 'నే వెళ్తున్నా' అని నారాయుడికి చెప్పి ముందుకి ఒక్కడే నడిచాడు.

పెద్దవీధిలో రోజూ ఉండే అంత సందడి లేకపోయినా పెద్ద గోలగా ఉన్నట్టనిపించింది చంటికి. వచ్చీపోయే లారీ మోతలు, బళ్ల చప్పుళ్లు పెద్ద రొదగా తన తలలో దూరుతున్నట్టు చిరాకుపడ్డాడు. నడుస్తుంటే ఒళ్లు గాలిలో తేలుతున్నట్టుంది.

నారాయుడు లేకుండా తనొక్కడే నడుస్తుంటే సరదాగా ఉండేది చంటికెప్పుడూ.... ఇప్పుడా సరదా లేదు. ఓపిక లేని ఒళ్లు నడవటానికి ఇష్టపడటం లేదు. ఒంటిలోని అలసట అరుక్కోసం, అరుగు మూల చింకి బొంత మీద నిద్దరకోసం ఎదురుచూస్తోంది.

వంతెన దగ్గర మలుపు తిరుగుతుంటే పెద్ద మోతతో డప్పులు ఎదురొచ్చాయి.... ఎవరిదో శవం.

ఉలిక్కిపడ్డాడు చంటి.... శవాన్ని చూసి కాదు, డప్పుల మోతకీ కాదు. తెల్లారితే మరిడమ్మ సంబరం అన్న విషయం గుర్తొచ్చింది ఆ డప్పుల మోతకి.... అందుకు.

తెల్లారకుండా నిద్దర లేపేస్తాడు నారాయుడు, తొందరగా వెళ్లకపోతే సంబరంలో సరి అయిన చోటు దొరకదని.... పొద్దుటి నుంచి సాయంత్రం దాకా ఆడాలి. 'ఛీ!' అనుకున్నాడు. ఈ ఒక్కరోజు ఎక్కడికేనా పారిపోతే? పూర్తిగా నారాయుణ్ణి వదిలి వెళ్లిపోలేడు. మళ్లీ తిరిగి రావాలి. వచ్చాక తంతాడు. తన్నటం కన్నా ఎక్కువగా భయపెడతాడు.

"నిన్నొదిలేసి పోలేననుకుంటున్నావా? నేనూ నిన్నొదిలేస్తే దిక్కులేని ఎదవ్వి, తిండిలేక రెండు రోజుల్లో సస్తావు. తెలిసిందా" అంటాడు. గడిచిన నాలుగైదేళ్లలో చాలాసార్లు అన్నాడు. అలా అని అని చంటిలో పిరికి మందు బాగా ఎక్కించాడు నారాయుడు. తను ఒంటరిగా ఎందుకు బతకలేడో తెలియకపోయినా, చంటికి భయమే.

అరుగు దగ్గరికొచ్చాడు. ఖాళీగా ఉంది అరుగు.... 'అక్క ఏ నీళ్లకో ఎళ్లుంటదిలే' అనుకున్నాడు. మూలచేరి, చింకిబొంతని సరిచేసుకుని మునగదీసుకు పడుకున్నాడు.

పడుకోగానే కళ్లు మూతలు పడ్డాయి చంటికి. కాస్సేపటికి మసక మసగ్గా కళ్లముందు గజ్జెలు, లారీలు, గేదెలు, శవం, డప్పులు..... ఉలిక్కిపడి లేచాడు.

అప్పుడే వస్తోంది సావిత్రి.

"ఎప్పుడొచ్చా.... ఆయనేడి" అంది.

"ఇప్పుడే.... షెడ్డుకాడున్నాడు" అన్నాడు చంటి సర్దుకు పడుకుంటూ.

"కూడు తిందూగాని లే" అంది. లేవాలనిపించలేదు చంటికి. అలాగే పడుకున్నాడు. మళ్లీ రెండుసార్లు పిలిచింది.

వాడి అలసట సావిత్రికీ తెలుసు. బలవంతంగా వాణ్ణి లేవదీసి తనే అన్నం కలిపి ఇంత తినిపించింది. పూర్తి మెలుకువ లేకుండా జోగుతూనే కాస్తంత తిని పడుకున్నాడు.

గుడ్డల మూటలా ముడుచుకుపోయి పడుకున్న చంటిని చూస్తే సావిత్రికి సహజంగా ఆడదాని గుండెలో ఉండే మెత్తదనం పొంగుకొచ్చింది. జాలేసింది.

'ఛీ..... పాడుమనిషి' అనుకుంది నారాయుణ్ణి గుర్తు తెచ్చుకుని. చంటి అలా అలిసిపోయి ఒళ్ళెరక్కుండా నిద్రపోతుంటే చాలాసార్లు చూసింది ఇదివరకు.

ఎప్పుడు చూసినా వాణ్ణి మొదటిసారిగా చూసిన ఆ రోజే గుర్తొస్తుంది.

ఆరోజు షెడ్డులో అలాగే పడుకున్నాడు చంటి. నారాయుడితో మొదటి రాత్రది తనకి.... చాలా

చలిగా ఉందా రాత్రి. షెడ్డులో అందరూ తలో చలితెరా కప్పుకుని నిండుగా ముసుగుల్లో పడుకున్నారు. ఇంకో గంటకి రెండో ఆట వదులుతారనగా తనని నారాయుడు ధైర్యం చేసి దగ్గరగా లాక్కున్నాడు. తనూ ఏం అనలేదు.... కాస్సేపు అలా....

అది గుర్తొచ్చినప్పుడల్లా సావిత్రికి ఇప్పటికీ ఒళ్లు వణుకుతుంది. కాస్సేపు అలా ఉన్నాక నారాయుడు లేచాడు. లేచి గుడ్డల మోపులా చుట్టుకుపోయి పడుకున్న చంటి ఒంటిమీంచి కంగారుగా, మోటుగా దుప్పటి లాక్కొచ్చాడు. చంటి ఓసారి మూలిగాడు. కొద్దిగా కదిలాడు. అంతేకాని లేవలేదు. గట్టిగా తన పొట్టకి, కాళ్లకి మధ్య చలిని దాచుకుని అలాగే పడుకున్నాడు.

చంటిమీంచి మోటుగా లాక్కొచ్చిన ఆ దుప్పటీయే ఇద్దరూ కప్పుకున్నారు. వాడి ఒంటిమీది ఆ చలి దుప్పటినే వెలుక్కి, రోడ్డు మీద వచ్చీ పోయే వాళ్ల కళ్లకి, షెడ్డులో వాళ్ల నిద్ర మెలుకువలకి తెరేసి తామిద్దరూ ఒకటయ్యారు.

నారాయుడు నిద్రపోయినా తనకు నిద్ర పట్టలేదు. చలికి ఊరికే కదులుతున్న చంటిని చూసింది. అప్పుడు మొదటిసారిగా జాలేసింది వాడిమీద. అడుక్కుతినే బతుకైనా తన గుండెలో వాడి మీద అభిమానం కలిగింది ఆ క్షణంలోనే.

మొదట తెలియకపోయినా క్రమేపీ తెలిసింది సావిత్రికి, వాడి కష్టం మీదే నారాయుడి సంపాదనని. చెప్పగానే వింటాడనుకున్న నారాయుడు ఎన్నిసార్లు చెప్పినా వినలేదు. వాడిచేత అలా ఆడించటం మానలేదు.

వాణ్ణి ఆడించకుండా అడుక్కోమంది. లాభసాటి కాదన్నాడు.

అడుక్కోవటం మానేసి ఎక్కడేనా కష్టం చెయ్యమంది. పనుల సంగతి నీకు తెలియదు, వస్తులు ఉండాలి, మాట్లాడకుండా ఊరుకోమన్నాడు.

నచ్చచెప్పింది, బతిమాలింది, నారాయుడు వినలేదు.

"ఆ పసోడి కష్టం మీది సంపాదనొద్దు. నేను కూడా కూలిచేస్తా" అంది సావిత్రి చివరికో రాత్రి. అది విని నవ్వాడు నారాయుడు. నవ్వి దగ్గరగా లాక్కున్నాడు "నువ్వు నా సుకానివి. నా సుకాన్ని కట్ట పడనిత్తానా" అన్నాడు.

నారాయుడి మొండితనం బాగా తెలిసొచ్చాక ఇంక చంటి గొడవెత్తటం మానుకుంది సావిత్రి. అంత తేలిగ్గా నారాయుడు ఆ సులువైన సంపాదనని వదులుకోడని నిర్ధారణ చేసుకుంది.

మొదటాట సినిమా జనం వెళ్లిపోయిన అరగంటకి ఏదో కూనిరాగంతో తూలుతూ వచ్చాడు నారాయుడు.

సావిత్రి అన్నం పెడుతుంటే మెదలకుండా తిన్నాడు. పడుకుంటుంటే -

"ఈ వేళా తాగావు కదూ?" అనడిగింది సావిత్రి. ముద్దగా "ఊఁ" అని మరోవేపుకి తిరిగి ముసుగెట్టుకు పడుకున్నాడు.

చాలాసేపటిక్కాని సావిత్రికి నిద్దరట్టలేదు. బాగా తెల్లారాక కాని మెలుకువ రాలేదు. లేస్తుండగానే నారాయుడి గొంతు వినిపించింది. చంటిని లేపుతున్నాడు. "ఇయాళ సంబరంరా, లేలే" అంటున్నాడు.

గబుక్కుని, నిండుగా నీళ్లున్నా, కుండని ఖాళీచేసి నీళ్లకి బయలుదేరింది సావిత్రి.

★ ★ ★

సూర్యుడు ఆ అరుగు మీంచి చూపు పూర్తిగా తిప్పుకోక ముందునుంచే సావిత్రి ఎదురు చూస్తూ కూర్చుంది.

పొద్దుటి నుంచి చాలాసేపు అరుగు చివర కూర్చుని రోడ్డు మీద వచ్చీపోయేసంబరం జనాన్ని చూస్తోంది. మధ్యలో ఎప్పుడేనా - గుండ్రంగా మూగే సంబరం జనం మధ్యలో నారాయుడు, చంటి ఊహగా కళ్లకి తోస్తే గబుక్కుని రోడ్డు మీంచి చూపు మార్చుకునేది.

బాగా చీకటి పడ్డాక కాని నారాయుడు, చంటి రాలేదు. ఆ చీకట్లో చంటి ముఖం కనపడలేదు సావిత్రికి.

"సాయిత్రీ, బలేగుందే ఈ ఏడు సంబరం" అన్నాడు నారాయుడు అరుగెక్కుతూ. ఆ చీకట్లో నారాయుడి సంతోషం వినిపించింది సావిత్రికి. "కడుపులో కాల్తోంది. కొంచెం కూడు వెచ్చబెట్టే, హోటలుకాడి కెల్లి ఈ చిల్లరిచ్చి నోట్లట్టుకుని ఇప్పుడే వస్తా" అన్నాడు.

చంటి ఎప్పుడు వెళ్లి పడుకున్నాడో చూడనేలేదు సావిత్రి. దగ్గరికెళ్లింది. "లేరా, చంటీ.... కూడు తినకుండా ఏంటా పడక" అంది.

వాడు కదల్లేదు. దగ్గరగా కూర్చుంటూ, "లేరా" అంది మళ్లీ.

"నాకు బాగాలేదక్కా, కూడొద్దు, ఇలాగే పడుకుంటా" అన్నాడు.

ఎలాగేనా లేవదీయాలని వాడి జబ్బ పట్టుకుంది. సావిత్రికి చెయ్యి చురుక్కుమంది. ఇంక వాణ్ణి లేపాలనిపించలేదు. నెమ్మదిగా వాడి కాళ్ల గజ్జెలు విప్పింది. దుప్పటి నిండుగా వాడి ఒంటిమీద కప్పి అక్కణ్ణించి లేచొచ్చింది.

అన్నం దగ్గర కూర్చుంటూ "ఆడు తిన్నాడా" అన్నాడు నారాయుడు.

"లేదు. రాగానే పడుకున్నాడు. జరం తగిలినట్టుంది" అంది పొడిగా సావిత్రి.

"పడుకోనీలే. ఇందాకా మందు బిళ్ల కొని ఏశాలే. తెల్లారేకాడికి ఆడే లేస్తాళ్లే. ఇయాళ ఎంతొచ్చిందో తెలుసా" అన్నాడు.

ఎంతని సావిత్రి అడక్కముందే - "పన్నెండు రూపాయల చిల్లర.... తెలుసా? ఇంక రేపు సూడాల..... సంబరం రేపే బాగుంటుందట అసలు.... చంటిగాడు బలే ఆడాళ్లే ఇవాళ" అన్నాడు.

చాలా హుషారుగా ఏవేవో చెప్పాడు నారాయుడు. సావిత్రి కూడా భోజనం చేస్తూ ఓపిగ్గా వాడి పన్నెండు రూపాయల హుషారుని వింది. భోజనం అయ్యాక కాస్సేపు బయటి కెళ్లాడు నారాయుడు. వస్తూ, వస్తూ రెండు కిళ్లీలు తెచ్చాడు. సావిత్రి కోటి ఇచ్చాడు.

సావిత్రి పక్కన దుప్పటి ముసుగులో ఇటునుంచటు, అటునుంచిటు దొర్లాడు. కూనిరాగాలు తీశాడు. చాలాసేపు కబుర్లు చెప్పాడు. మాట్లాడుతూ, మాట్లాడుతూ సావిత్రిని మోచేత్తో సరదాగా పొడిచాడు. కితకితలు పెట్టాడు.

సావిత్రికూడా నవ్వగలిగినంతా నవ్వింది. నారాయుణ్ణి కలుసుకున్న కొత్తలో తను నవ్విన నవ్వులాగే ఉండాలీ నవ్వు అని ఎంతగానో ప్రయత్నం చేసింది. వాడికన్నా రెట్టింపు ఉత్సాహం చూపించింది. ఆ చిన్న అరుగు మీద, వాళ్లు పడుకున్న ఆ కొద్ది జాగాలోనే నారాయుడికి వీలుగా దొరక్కుండా అటూ, ఇటూ దొర్లి ఏడిపించింది. పొంగిపోతున్న వాడి ఒంటిలో నరనరాన్ని కావాలనే మెలేసింది. వాడితో తనూ. మెలికలు తిరిగింది. తిరిగి, తిరిగి మధ్యలో - "మావాఁ" అంది.

ఎంతో మత్తు వినిపించింది నారాయుడికి. "ఏంటే" అన్నాడు. "ఓటి చెప్పనా...." అంది ఇంకా మత్తుగా. "ఏటే అది" అన్నాడు మరీ పొంగిపోతూ నారాయుడు.

"చంటి చూడు, మావాఁ, ఊరికే ఎలా కదులుతున్నాడో..... రోజూ ఇంతే. ఇలాటప్పుడు ఆడదాన్ని నాకెలా ఉంటదో ఎలా చెప్పను? వాడికీ వయసొస్తోంది. ఇంక రోజురోజుకీ ఆడు అడ్డే మనకి" అంది దగ్గరగా జరుగుతూ. తన ఆడతనాన్ని ఉపయోగించుకుంటున్నందుకు సావిత్రి వొణికింది. ఆ వణుక్కి మరీ మత్తులో కూరుకుపోయాడు నారాయుడు. "ఏందే నువ్వనేది" అన్నాడు విసుగ్గా.

"ఆడు మనకి అబ్బ చుట్టమా, అమ్మ చుట్టమా! ఎందుకు పీడ..... ఈ రాత్రే మనిద్దరం ఎటేనా పోదాం" అంది. మాటలతోటి, ఒంటితోటి, ఆ అరుగు మీద చీకటి చాటుతోటి నారాయుణ్ణి ఓ గంటకి మెల్లగా లొంగదీసుకుంది.

"రేపు కూడా గడవనీకూడదే? ఈ సంబరం అయిపోయాక పోదాం" అన్నాడు నారాయుడు చివరికి.

"లేదు, మావాఁ! ఆడికి ఒళ్లు బాగా లేనప్పుడే పోవాలి. లేకపోతే అణ్ణీ, ఈణ్ణీ అడిగి ఎంటపడినా పడతాడు.... ఈ రాత్రికే" అంది గునుస్తూ. సరే అనక తప్పలేదు నారాయుడికి.

ఇంకా ఓ ఝాము పొద్దుందనగా రెండు మూటల్ని చంక నెట్టుకుని అరుగు దిగుతూ దిగుతూ, చంటివేపు చూసింది సావిత్రి. నెమ్మదిగా నిద్దర్లో కదిలాడు.

'ఇంక ఈ గజ్జెలు కట్టుకుని ఆడే పీడుండదు నీకు. నీ బతుకు నువ్వు బతకలేకపోలేవు' అనుకుంది సావిత్రి. తన దగ్గర ఎప్పటినుంచో దాచి ఉంచిన రూపాయుంటే వాడి పక్కలో పారేసింది.

మర్నాడు మిట్టమధ్యాహ్నానికి కాని చంటికి తెలివి రాలేదు. కళ్లు తెరిచి చుట్టూ చూశాడు. అరుగంతా ఖాళీగా ఉంది. 'అక్కేది?' అనుకున్నాడు. గుండె గుభేలుమంది. భయమేసింది. గట్టిగా ఏడిస్తే బాగుండు ననుకున్నాడు. ఏడిచే శక్తి కూడా లేనట్టు అలాగే సొమ్మసిల్లి పడుకున్నాడు.

సాయంత్రానికి ఓపిక తెచ్చుకుని నెమ్మదిగా లేచాడు - షెడ్డు దాటుతుంటే, షెడ్డులోంచి రంగి పిలిచింది "ఏంటిరా ఒక్కడివీ ఎలుతున్నా.... ఎక్కడికీ" అంది.

ముందు ఏడ్చాడు చంటి. ఏడ్చి, జరిగింది చెప్పాడు.

వాడి ఏడుపు చూసి నవ్వింది రంగి. "ఊరుకోరా, ఆడదానిలా ఏడుపేటి.... ఆళ్లు పోతే ఏం? మేం లేమేంటి..... ఇక్కడే షెడ్డులో ఉండు.... నీ బతుకు నువ్వు బతకలేకపోవు" అంది.

నెమ్మదిగా కాస్సేపటికి ఏడుపు మింగేశాడు చంటి. నారాయుడు గుర్తొచ్చేటప్పటికి ఉక్రోషం వచ్చింది. 'అవును. బతకలేకపోతానేటి' అనుకున్నాడు మొండిగా, కళ్లు తుడుచుకుంటూ.

'చంటిగాడు ఆడితే నారాయుడిలా నే పాడగలనా' అనుకుంది రంగి. అనుకుంటుంటే ఆ ఆట చుట్టూ గుంపుగా మూగే జనం, అలా మూగినాళ్ల జేబులు కొట్టటంలో సులువు తన ఆలోచనకి గిలిగింతలు పెట్టాయి.

• *ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 21-7-1971*

• *మంజరి, ఫిబ్రవరి 1980 (తమిళం)*